# తల్లిని హత్య చేసిన కొడుకు






# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 10 జూన్ , 2024 | పేజీలు : 04


# వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ సర్కార్

* అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలి
* ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
* అయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి
* 300 కోట్లతో అయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పంట పెట్టుబడిసాయం రైతులకు తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. వానకాలం వచ్చిన ప్రభుత్వం నుండి ఏలాంటి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఎరువుల కొరత లేకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం అక్కెనపల్లి గ్రామంలో అయిల్‌ఫామ్ మొట్టమొదటి క్రాఫ్ కటింగ్ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. అయిల్ ఫాం ప్రకృతి ప్రసాదించిన వరమని,. రైతులు ఎదగటానికి దోహదపడుతుందన్నారు. ఎకరాకు లక్ష 20 వేల ఆదాయం వరకు ఉంటుందన్నారు. ఆరుగాలం శ్రమించే రైతన్నకు లాభం చేయాలని కెసిఆర్ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో అయిల్ ఫామ్ సాగుకోసం ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. పంట డ్రిప్‌తో పాటు ఎస్సీ,ఎస్టీలకు వందశాతం సబ్సిడి అందించాలన్నారు. ఆ చర్యల ఫలితంగానే తెలంగాణ అయిల్‌ఫామ్ సాగులో అత్యధిక వృద్ధి సాధించిందన్నారు. దళారి వ్యవస్థ లేదని, ధర రాదనే అనే బాధ లేదన్నారు. అయిల్ ఫామ్ ద్వారా నేరుగా ఖాతాల్లో నగదు జమఅవుతుందన్నారు.300కోట్లతో 120 టన్నుల క్రషింగ్ సామర్ధ్యంతో అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరుగుతుందన్నారు. దేశంలోఅతి పెద్ద ప్యాక్టరీ మనకు సిద్దిపేటకు రావటం సంతోషకరమన్నారు. సిద్దిపేట జిల్లా నుండి కాకుండ జనగాం, మహబూబ్‌బాద్, గద్వాల్,నారాయణపేట ,భువనగిరి అయిల్ ఫామ్ పంటకు ఇది కేంద్రంగా ఉంటుందన్నారు. మూడు అయిల్ పామ్ నర్సరీలు పెట్టి మొక్కలు అందిస్తుందన్నారు. 11.268 ఎకరాలో సాగుతో ఖమ్మం జిల్లా తర్వాత సిద్దిపేట జిల్లా ఉందన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుతో సిద్దిపేట ఆదర్శంగా నిలచి కోనసీమగా ఈ ప్రాంతం వృద్ధి చెందుతుందన్నారు. కొత్త ప్రభుత్వం అయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలిన సూచించారు. దేశంలో అయిల్‌ఫామ్ రైతులకు లాభం జరుగాలంటే దిగుమతిపై డ్యూటీ వేయాలని కోరారు. గతంలో15 నుండి 43 శాతం ఉండేదని కేంద్రం తొలగించటంతో విదేశాల నుండిఇబ్బడి ముబ్బడిగా అయిల్‌పామ్ దిగుమతి అవుతుందన్నారు. అయిల్ ఫామ్ మెయిన్‌టెయిన్ చేయటానికి 4200 రూపాయలు బిఆర్ఎస్ సర్కార్ ఇచ్చేదని ,కాంగ్రెస్ సర్కార్ అవి చెల్లించటం లేదన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ డబ్బులను విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఎరువు ల కొరత రాకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు అన్ని పంటలకు 500 బోనస్ ఇస్తానని చెప్పి. ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటున్నారన్నారు. రైతుల బోనస్ విషయంలో మంత్రులు తలోమాట మాట్లాడుతన్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం చేస్తామని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. ఈకార్యాక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, నాగేందర్, మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి,కోల రమేశ్, సారయ్య, బిక్షపతి, రాధకిషన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


# అభివృద్ధికి ఆమడ దూరంలో నస్కల్ గ్రామం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో గ్రామం అభివృద్ధి చెందుతాదనుకుంటే ఆమెడ దూరానికి ఆదర్శంగా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఏ విధంగా అయితే నష్టపోయిందో నస్కల్ గ్రామం కూడా అదేవిధంగా అభివృద్ధికి నోచుకోలేదు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అందులోని నూతన మండలాల ఎంపికలో నిజాంపేట మండలాన్ని కూడా ఏర్పాటు చేసినందుకు ఆవాస గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చివేరు చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంకణ బద్ధులైంది. అయినందున పెద్ద గ్రామాలు నుండి చిన్న గ్రామాలుగా విడిపోయి అభివృద్ధి చెందుతాయని అనుకునే సమయానికి గ్రామానికి ఏదో రూపంలో నిధులు తీసుకువచ్చి నిర్మాణాలు చేసి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా నాయకుల పరాకాష్టకు నిదర్శనం అన్న విధంగా గ్రామంలో గత పది సంవత్సరాల కాలంలో డ్వాక్రా సంఘాలకు మహిళా భవనం మంజూరు అయ్యింది. దానికి శంకుస్థాపన చేసి బిస్మిట్ నిర్మాణం పనులు చేయడం జరిగింది. అది అంతలోనే ఆగిపోయింది. నిధులు రాకన వచ్చిన నిధులు సరిపోకనా ఎవరు చేయాలనే నిర్లక్ష్యమా పది సంవత్సరాలు దాటిన ఆ పని పూర్తి కాలేదు. అదే విధంగా గ్రామంలో పాల ఉత్పత్తి దారులకు పాల కేంద్రానికి భవనం మంజూరు అయింది. ఈ పని కూడా ప్రారంభం చేసి బేస్మెంట్ లెవల్ నిర్మాణం జరిగి ఈ పని కూడా ఆగిపోయింది. దీని పరిస్థితి కూడా ఇంతేనా తెలియాల్సి ఉంది. ఇదే తరహాలో గ్రామ పంచాయతీలు విడిపోయి కొత్త గ్రామాలుగా రూపాంతరం చెంది కొత్త గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కై తీర్మానాలు పంపించడం జరిగింది. అందులో కూడా నస్కల్ గ్రామ పంచాయతీ భవనానికి తీర్మానాలు చేసి పంపించడం జరిగింది. ఈ భవన నిర్మాణానికి ఏమైనా నిధులు వచ్చాయా రాలేదా తెలియాల్సి ఉంది.? అదేవిధంగా గత పాలనలో గ్రామానికి మిషన్ భగీరథ గాను వాటర్ ట్యాంకుల నిర్మాణం జరిగింది. పల్లె ప్రకృతి వనాలు పూర్తయినాయి వన నర్సరీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పని జరిగాయి. వాడవాడనా సిసి రోడ్ల నిర్మాణం జరిగింది. ఎక్కడ లేని విధంగా తెలంగాణ క్రీడా ప్రాంగణం గ్రామంలో రూపుదిద్దుతుంది. గ్రామంలో దాతల సహకారంతో ఓపెన్ జిమ్ పనులు పూర్తయినాయి. దాతల సహకారంతో వైకుంఠ రథం నిర్మాణం జరిగింది. కానీ గ్రామానికి ప్రభుత్వం ద్వారా మొట్టమొదటగా మంజూరైన స్మశాన వాటిక వైకుంఠధామం పనులు ఇంకా పూర్తిస్థాయిలో పనులు జరిగాక మధ్యలోనే ఆగిపోయే బోసిపోయినట్లు ఉంది.? ఈ నిర్మాణం యొక్క నిధులు రాకన చేసేవారు లేఖన ఎవరు చేయాలని నిర్లక్ష్యమా..? మండలంలోని మొట్టమొదటిగా భూమి పూజ చేసిన వైకుంఠధామానికి ఐదు సంవత్సరాలు పూర్తయిన పనులు పూర్తి చేయకపోవడం వెనుక నాయకుల అలసత్వమా అధికారుల లోపమా..? ఈ పనులు ప్రారంభమై జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారిన పనులు కాకపోవడం ఈ నియోజకవర్గానికి ఈ గ్రామానికి ఈశాన్యంలో ఉండడం పాపమా..? మా గ్రామానికి గత ఐదు సంవత్సరాల కాలం నుండి గ్రామానికి ప్రధాన రహదారిగా ఉన్న నిజాంపేట నుండి నస్కల్ వరకు డబుల్ రోడ్డు మంజూరు అవుతుందని నాయకులు ప్రజా ప్రతినిధులు తెలపడం వల్ల గ్రామానికి మరో దశ చెందుతుందని అనుకున్న క్రమంలో గత సంవత్సరం నర కాలం నుండి రోడ్డు నిర్మాణ పనులు కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించినప్పటికీ నేటికీ నిత్యం రోడ్డెంబడి వస్తున్న వాహనాలు ప్రయాణికులు నిర్మాణం పూర్తికాని కంకర రోడ్డుపై అష్ట కష్టాలు పడుకుంటూ ప్రజలు నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ మండల కేంద్రానికి రావడానికి వేరే ప్రాంతాలకు వెళ్లడానికి నానా బాధలు పడుతూ ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఇది కూడా ఈ గ్రామ ప్రజలు చేసుకున్న పాపమా..? స్థానిక ఎమ్మెల్యే ప్రస్తుత ప్రభుత్వం చొరవతో గ్రామంలో మిగిలిన అభివృద్ధి పనులు జరిగేనా? సంబంధిత జిల్లా కలెక్టర్ చెరువుతోనైనా రోడ్డు పని మహిళా భవనం పాల ఉత్పత్తి దారుల కేంద్రం స్మశాన వాటిక పనులు పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ‘సమస్యల సంత’

సొంత స్థలం కరువు
రోడ్డుపైనే అంగడి నిర్వహణ
కొరవడిన వసతులు
ఇబ్బందుల్లో వ్యాపారులు




**ప్రజాపక్షం/దుబ్బాక :** నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకలో ప్రతి శనివారం పెద్దెత్తున సంత జరుగుతుంది. దుబ్బాక లచ్చపేట రహదారిపై సంత జరుగుతుంది. దుబ్బాక పట్టణం మూడు జిల్లాలకు ( రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్) సరిహద్దు గా ఉండడంతో దుబ్బాక అంచలంచెలుగా వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. ఐనప్పటికీ సంత నిర్వహించేందుకు స్థలం లేక రహదారిపైనే నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేకపోవడంతో వ్యాపారస్తులు , కూరగాయాల విక్రయదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా మున్సిపాలిటీకి వేలం ద్వారా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ సంతలో నేటికీ కనీస వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, మున్సిపాలిటీ పాలక వర్గం చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారు. పైగా అసలే ఎండా కాలం కావడంతో తాగేందుకు నీరు లేక రైతులు, వ్యాపారులు నరకం చూస్తున్నారు. ఆదాయం పొందడంలో చూపించిన చొరవ సంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

## తప్పని వెతలు

సంతలో ప్రతి శనివారం దుబ్బాక లో కూరగాయాల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ఉదయం నుండి రాత్రి వరకు సంత వ్యాపారులతో సంత నిర్వహించే స్థలం కిటకిటలాడుతుంది. వ్యాపారులకు, విక్రయదారులులకు నిలువ నీడ, సరిపడా తాగు నీరు లేక ఎండ కు సైతం ఇబ్బంది పడుతున్నారు. తూతూ మంత్రంగా మరుగుదొడ్లు నిర్వహించి నిర్వహణ మాత్రం మరచిపోయారని చెప్పుకోవచ్చు. సంతలో నున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని, ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

## రోడ్డుపైనే విక్రయాలు



దుబ్బాకలచ్చపేట రహదారిపై సంత నిర్వహించడం మూలంగా ప్రతి శనివారం కామారెడ్డికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు రోడ్డుపై నిలుపడవంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. దీంతో ప్రయాణికులు, ప్రజలు వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

# తల్లిని హత్య చేసిన కొడుకు



ప్రజాపక్షం/శాయంపేట : చింత చెట్టు విషయంలో ఒక వ్యక్తితో గొడవ జరిగిన విషయమై భార్యభర్తల మధ్యలో ఘర్షణలో తల్లి అడ్డు పడగా కొడుకు కోపంతో అక్కడే ఉన్న మంచం అడ్డపట్టెతో తలపై బాదడంతో తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన మోతె తిరుపతి రెడ్డి ఇంటి పక్కనే ఉన్న చింత చెట్టు విషయంలో భేతు జయపాల్ రెడ్డితో గొడవ పడ్డాడు. తిరుపతి రెడ్డి భార్య నగమణి అక్కడికి వచ్చి ఘర్షణ జరుగకుండ భర్తను ఇంట్లోకి తీసుకెళ్లింది.దాంతో ఆగ్రహించిన తిరుపతి రెడ్డి భార్యపై గొడవకు దిగి కొట్టబోతుండగా తనతల్లి అమృతమ్మ ఆపే ప్రయత్నం చేయగా కోపంతో అక్కడే ఉన్న మంచం అడ్డపట్టెను తీసుకుని తల్లి తలపై బాదడంతో తలకు బలమైన గాయమై రక్తస్రావం జరిగింది. అమృతమ్మను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించినా ఫలితం లేకుండా శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు అమ్మ తమ్ము కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని రూరల్ సీఐ రంజిత్ రావు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

## ఎంఎల్‌సిగా తీన్మార్ మల్లన్న గెలుపు చరిత్రాత్మకం



ప్రజాపక్షం/బచ్చన్నపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపు చారిత్రాత్మకమని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. తీన్మార్ మల్లన్నను యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానేతగా మల్లన్న గెలవడం మంచి పరిణామమని తీన్మార్ మల్లన్నకు ఓటు వేసిన ప్రతి ఒక్క పట్టభద్రునికి, ఈ గెలుపుకు కృషి చేసినటువంటి అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మచ్చ సందీప్ కుమార్, నల్లగోని వేణుగౌడ్, లక్కర్సు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



ప్రజాపక్షం/పాలకుర్తి : బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెన్నూరులోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు పాఠశాలలకు కల్పిస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐఎఫ్‌పీటీవీల ద్వారా బోధన జరుగుతుందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్స్, ఉచిత నోట్‌బుక్స్, ఎన్‌ఎమ్ఎమ్ఎస్ స్కాలర్‌షిప్స్ మొదలైనవి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్, ఎంపీటీసీ కళింగరావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎంలు జగ్రుత రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, వార్డెన్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావు మృతికి పలువురి సంతాపం

ప్రజాపక్షం/హసన్‌పర్తి : గ్రేటర్ వరంగల్ 5వ డివిజన్ హనుమాన్ నగర్ ఫేజ్. 1 కాలనీలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, రామోజీ ఫిల్మ్ సిటీ, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీ రావు అకాల మృతి చింతిస్తూ ఆదివారం ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీరావు మృతితో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, రాజకీయ, సినీ, వివిధ రంగాల ప్రముఖులు విషాదంలో మునిగిపోయారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నిడిగొండ వెంకటేస్వామి, మొట్ల మనోహర్, ఎండీ రుకుముద్దీన్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/మహాదేవపూర్ : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల శాఖ ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్,సహాయ కార్యదర్శి ఆన్కారి ప్రభాకర్ కోరారు.ఆదివారం మండల కేంద్రంలో ఉద్యమకారుల మండల శాఖ ఆధ్వర్యంలో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేసారు. అనంతరం రాష్ట్ర నాయకుడు అయ్యూబొద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలాలు ఇవ్వాలని అన్నారు.జార్ఖండ్ రాష్ట్రంలో ఆ ప్రభుత్వం ఉద్యమకారులకు ప్రతి నెలా పింఛన్ ఇచ్చి ఆదుకుంటుందని అన్నారు.ఉద్యమకారులను గుర్తించి కమిటీ ఏర్పాటు చేయాలని గుర్తించిన ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల సక్షేమ బోర్డును ఏర్పాటు చేసి అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు.ఉచిత బస్సు పాసు ,హెల్త్ కార్డులు అందజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి మహేష్,ఠాకూర్ రమేష్ సింగ్,మేసినేని వెంకటేశ్వర్ రావు,మేసినేని దేవేందర్, పిడుగు సమ్మయ్య,ఎండి అక్రమొద్దీన్, నట్టబాగ ధర్మయ్య, జాడి గట్టయ్య, కూరతోట శ్రీహరి, కోల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల హర్షం



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : వరంగల్ నల్లగొండ ఖమ్మం ఎంఎల్‌సి ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ హర్షం వ్యక్తంచేసారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఎల్‌సి ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను గెలిపించిన పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల పక్షాన వారి సమస్యలు పరిష్కరించడం కోసం మల్లన్న కృషిచేస్తారని అన్నారు. గత ప్రభుత్వం పట్టభద్రులు, నిరుద్యోగులను పట్టించుకోకపోవడంతో బిఆర్ఎస్ వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. బిజెపి ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వే వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తామనే నిర్ణయాలతో పట్టభద్రులు ఓటుతో బుద్ధిచెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్ నాయక్, మాడుగుల జయపాల్, మాడుగుల సంపత్ కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

## లయన్స్ సేవలు పెంచేందుకు సభ్యుల సంఖ్య పెరగాలి




ప్రజాపక్షం/జనగామ టౌన్ : సమాజంలోని అవసరార్థులను ఆదుకోవడానికి లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు పెంచేందుకు అనుగుణంగా లయన్స్ సభ్యుల సంఖ్య పెరగాలని 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకట రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సెంట్‌మేరియా హైస్కూల్లో నిర్వహించిన రీజియన్ 6, 7, 8 క్లబ్ సారథుల శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. రీజియన్ చైర్మన్‌లు ఆర్ వెంకట్‌రెడ్డి, కె భాస్కర్‌రెడ్డి, సీహెచ్ రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మహబూబాబాద్, తొర్రూరు, పాలకుర్తి, జనగామ, చేర్యాల ప్రాంతాల నుండి లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరుశరాములు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సారథ్యంలో క్లబ్ అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ డా. కె చంద్రశేఖర్ ఆర్యా, పూర్వ జిల్లా గవర్నర్‌లు డా. డి లవ కుమార్‌రెడ్డి, తమ్మెర లక్ష్మి నరసింహరావు, జిల్లా వైస్ గవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్, జిల్లా క్యాబినేట్ కార్యదర్శి సయ్యద్ హబీబ్, రీజియన్ చైర్మన్‌లు సీహెచ్ రవీందర్‌రెడ్డి, కలువల భాస్కర్‌రెడ్డి, ఆర్ వెంకట రెడ్డి, జోన్ చైర్మన్‌లు పి జయహరి, ఆర్ ప్రవీణ్‌కుమార్, రఘు, వేణుగోపాల్, కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాస్, వెంకట్‌రెడి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## సిపిఐకి బాలమల్లు సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/కొహెడ : సీపీఐ పార్టీకి బాలమల్లు చేసిన సేవలు మరువలేనివని ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.కొహెడ మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వేల్పుల బాలమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం వారి కుటుంబాన్ని సిపిఐ నాయకులతో కలిసి మంద పవన్ పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సీపీఐలో క్రియాశీలకంగా పనిచేస్తూ సీపీఐ కరీంనగర్, సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులుగా, కొహెడ మండల కార్యదర్శిగా పని చేసి ఆయన జీవితం పార్టీ కోసం గడిపిన గొప్ప వ్యక్తి బాలమల్లు అని ఆయన సేవలను కొనియాడారు.వారి వెంట సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేశ్, అందె అశోక్, కనుకుంట్ల శంకర్, కొహెడ మండల కార్యదర్శి ముంజ గోపి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, మండల సహాయ కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు బంగారు ప్రేమ్ కుమార్, సముద్రాల కార్యదర్శి వారి తదితరులు ఉన్నారు.

## స్నేహ యూత్ అసోషియేషన్ అధ్యక్షుడిగా మేక రాజు



ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మండలకేంద్రంలో ఎస్‌సి కాలనీలో స్నేహ యూత్ అసోషియేషన్ కమిటిని ఎన్నుకోగా నూతన అధ్యక్షుడుగా మేక రాజు,ఉపఅధ్యక్షుడుగా కోడూరి శ్రీకర్,ప్రధానకార్యదర్శి కొయ్యడ రవీందర్,సహాయకార్యదర్శిగా రాజు,కోశాధికారిగా మోతె రాజు,సలహాదారులుగా గూడూరి శ్రీనివాస్,కొయ్యడ అశోక్,జోగు ప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ స్నేహయూత్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతిఒక్కరికి క్రుతజ్ఞతలు తెలుపుతున్నానని తెలపారు.కమిటి సలహాలు సూచనల మేరకు నడుచుకుంటూ యూత్ అభివృద్ధికి క్రుషిచేస్తానని తెలిపారు.కార్యక్రమంలో యూత్ కమిటిసభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/బచ్చన్నపేట : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పనిచేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని మండలంలోని బండనాగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను ఆదరించారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విసిగి వేసారిన ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. అదే స్ఫూర్తితో ప్రజలకు అవసరమైన సేవలను, సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారన్నారు. త్వరలోనే రైతులకు రైతు భరోసాతోపాటు, రైతు రుణమాఫీ రూ.2లక్షల వరకు మాఫీ అవుతుందన్నారు. రానున్న రోజులలో అన్నదాతల సౌకర్యార్థం మరిన్ని సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తారన్నరు. ఈ కార్యక్రమంలో కొడవటూర దేవస్థాన కమిటి డైరక్టర్ ఆరెళ్ల భాస్కర్, నాయకులు మానెపల్లి భూమయ్య, శ్రీకాంత్, పలువురు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టిని మళ్ళించేందుకే మంత్రి పొన్నంపై ఆరోపణలు



ప్రజాపక్షం/కమలాపూర్ : రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అసత్యపు ఆరోపణలను ఖండిస్తూ హుజురాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోడేటి భిక్షపతి ఆధ్వర్యంలో కమలాపూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు తవుటం రవీందర్, బాలసాని రమేష్ గౌడ్, పలువురు నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రజల ఆగ్రహానికి కాలిపోయి బూడిదైపోయినటువంటి బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న పాడి కౌశిక్ రెడ్డి బూడిద రవాణా పై అర్థంలేని అసత్యపు ఆరోపణలు చేయటం సిగ్గుచేటని, 38 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ అంచలంచెలుగా ఎదిగి నేడు ఒక రాష్ట్ర మంత్రిగా నిబద్ధతతో నిజాయితీతో విధులు నిర్వహిస్తున్న పొన్నం ప్రభాకర్ గౌడ్ పైన అసత్యపు ఆరోపణలు చేసే అధికారం కౌశిక్ రెడ్డికి లేదని అన్నారు. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని అనైతికంగా గెలిచిన కౌశిక్ రెడ్డి మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గంలో మూడవ స్థానానికి తన పార్టీ పడిపోయిన విషయాన్ని ప్రజల దృష్టిని మళ్ళించడానికి మంత్రి పై విమర్శలు చేస్తున్నారు కౌశిక్ రెడ్డి అన్నారు. 2018 లో కౌశిక్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఎప్పుడో కనుమరుగైపోయేవాడని, కాంగ్రెస్ భిక్షతోనే రాజకీయంగా ఎదిగిన కౌశిక్ రెడ్డి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై నిజాయితీకి నిలువుటద్దమైన పొన్నం ప్రభాకర్ గౌడ్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని అన్నారు. ఇక పై ఇలానే కొనసాగితే నియోజకవర్గంలో తిరగనివ్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశిని ఐలయ్య గౌడ్, నాంపల్లి ప్రభాకర్, శివకృష్ణ, పెరుమాండ్ల పరశురాములు గౌడ్, నల్లాని సురేష్, తాటిపాముల రాములు, గట్టు శ్రీధర్, మౌటం రమేష్, ఆడెపు శ్రీకాంత్, మొగిలిచర్ల శ్రీనివాస్, పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్, కుమ్మరి ప్రశాంత్, వెంగళ శివానందం, కంకటి రామకృష్ణ, పుల్ల వెంకటేష్, జక్కుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసి రాష్ట్ర కన్వీనర్‌గా సుధాకర్

ప్రజాపక్షం/పాలకుర్తి : తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్‌ను నియమిస్తూ తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మానవతారాయ్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ 2016 విద్యార్థి జేఏసీ పాదయాత్రలో కీలక భూమిక పోషించి విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై ఉద్యమిస్తూ వాటి పరిష్కారం కోసం అనునిత్యం కృషి చేస్తున్న డాక్టర్ సుధాకర్‌ను తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన రజక సంఘం జిల్లా అధ్యక్షురాలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎంఎల్ఏ జిఎస్ఆర్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : రజక సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గోపరాజు సాంబలక్ష్మీ తో పాటు పలువురు 4వ వార్డు ఇంచార్జీ, 22వ వార్డు కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు క్యాతరాజు సాంబమూర్తి, మహిళా పట్టణ ప్రధాన కార్యదర్శి పద్మ, 3వ వార్డు నాయకురాలు పుష్ప ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు వీరే పైడిపల్లి రమ(23వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు), బొమ్మెర రాజేశ్వరి(టీయూఎఫ్ ఉపాధ్యక్షురాలు), రజక సంఘం సభ్యులు పోతపెల్లి రాజలక్ష్మి, తిరుపతి, రమేష్, రాములు, రమ్య, మంజుల, బేగం, స్వప్న, లక్ష్మీ, ప్రశాంత్, సరోజన లతో పాటు మరో 20 మంది ఉన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/గణపురం : గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన యూట్యూబ్ జర్నలిస్ట్ మరుపట్ల కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి 1990/1991 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన స్నేహితులు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. జెడ్పిహెచ్ఎస్ గణపురం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు కుమార్ కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్షర యోధుడు రామోజీకి ఘనంగా నివాళి



ప్రజాపక్షం/రఘునాథపల్లి : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, అక్షర యోధుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. ఆదివారం మండల కేంద్రంలోని అండర్ పాస్ వద్ద జరిగిన సంతాప కార్యక్రమం రఘునాథపల్లి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా మండల పాత్రికేయులంతా కలిసి నల్ల బ్యాడ్జిలు ధరించి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, బీజేపీ పార్టీ నియోజకవర్గ నాయకుడు సాయిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ పార్టీ మండల నాయకుడు మహ్మద్ జహంగీర్, ప్రెస్‌క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి కందుల అనిల్‌కుమార్, కోశాధికారి కొన్నె సతీష్, మేకల రవీందర్, మహ్మద్ దస్తగిరి, సుంకరి శ్రీనివాస్, నాసగోని శ్రీనివాస్, మోదుగు శ్రీనివాస్, బొల్లం రంజిత్, రాసమళ్ల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ హైస్కూల్ టీచర్ కిషోర్‌కు ఇస్రో ఆహ్వానం

ఐదు రోజుల శిక్షణకు అవకాశం



ప్రజాపక్షం/నెక్కొండ : నెక్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పూస కిషోర్‌కు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, ఇస్రో ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణకు అవకాశం దక్కింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఎస్ఆర్) సంయుక్తంగా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఇస్తున్న శిక్షణలో కిషోర్‌కు అవకాశం లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో హిందీ పండితుడిగా పనిచేస్తున్న కిషోర్ హిందీ బోధనతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ, స్కూల్ ఇన్నోవేటివ్ ఛాలెంజెస్ తదితర కార్యక్రమాలలో కొన్నేళ్లుగా చురుకుగా పాల్గొంటూ శాస్త్ర, సాంకేతిక అంశాలపై తన ఆసక్తిని కనబరుస్తుంటారు. ఈ క్రమంలో జూన్ 10 నుండి14 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కిషోర్‌కు చోటు దక్కింది. స్పేస్ టెక్నాలజీ దాని అనువర్తనాలు అనే అంశంపై ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి కిషోర్‌కు అవకాశం రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు, సహచర పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌ను స్టేట్ కన్జ్యూమర్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్, తదితరులు అభినందించారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



ప్రజాపక్షం/నెక్కొండ : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెక్కొండలో తురక వెంకటేశ్వర్లు అనే మేస్త్రీ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా ఉదయగిరి గ్రామానికి చెందిన ఎండి మీరా(45), ఆమె భర్త ఎస్‌కె అరాఫత్ అలీలు సుతారి పని చేసేవారని, శనివారం రాత్రి భోజనాలు అయిన తర్వాత భార్యభర్తలు ఇద్దరు బిల్డింగ్ మీద పడుకున్నారు. రాత్రి సమయంలో వారిద్దరి మధ్య చిన్న గొడవ జరిగిందని, మేస్త్రీ తురక వెంకటేశ్వర్లు వారి గొడవను సర్దుమనుపగా, తెల్లవారిజామున ఉదయం 6 గంటల సమయంలో తాపీ మేస్త్రీ భార్య లక్ష్మీ దేవి బిల్డింగ్ మీద పడుకున్న కూలీలను నిద్ర లేపడానికి వెళ్లగా ఎండి మీరా మరణించిందని, ఆమె భర్త అలీ ఘటన ప్రదేశంలో కనిపించలేదని, తాపీ మేస్త్రీ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీకొని ఇరువురికి గాయాలు

ప్రజాపక్షం/రఘునాథపల్లి : రెండు బైకులు ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన తోట గణేష్ తన ద్విచక్రవాహనంపై సొంత పనుల నిమిత్తం గబ్బెటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పిట్టలగూడెం వద్దకు చేరుకోగానే అప్పటికే పిట్టల గూడెంకు చెందిన జోధావత్ నరసింహులు తన ద్విచక్ర వాహనంపై అదేవైపు నుండి వస్తూ రోడ్డు పక్కనే గల మామిడితోట వద్దకు రాగానే బైకును ఒక్కసారిగా మామిడితోట వైపు తిప్పడంతో వెనకాల వస్తున్న గణేష్ బైక్ అదుపుతప్పి నరసింహులు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడడంతో వారికి గాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న ప్రయాణికులు ఆగి 108కి ఫోన్‌చేసి సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వారిని వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది.

## క్యాన్సర్ వ్యాధిని భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాపక్షం/రఘునాథపల్లి : ఫతేషాపూర్ గ్రామానికి చెందిన చీరబోయిన సత్తమ్మ (75) గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షలు చేసి క్యాన్సర్ వ్యాధి సోకినట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సత్తమ్మ గత ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన గాజుపాటి తానాజీ దిగుడు బావిలోకి దిగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా తన కూతురు మాధవి వచ్చి ఇంటికి తీసుకొని వెళ్లింది. అయినా కూడా తన క్యాన్సర్ నొప్పి తగ్గదని భావించి ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఎక్కడ తిరిగిన వృద్ధురాలు కన్పించకపోవడంతో అనుమానం వచ్చి తానాజీ బావి వద్దకు వెళ్లగా వృద్ధురాలు చెప్పులు బావి దగ్గర కన్పించాయి. అనుమానం వచ్చి బావిలోని నీటిని మోటార్ సహాయంతో బయటకు తోడగా వృద్ధురాలి మృతదేహం కన్పించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమం పునః ప్రారంభం : కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల కోడ్ ఉండడం వలన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేయడం జరిగిందని ఎన్నికలు పూర్తి అయినందున ప్రభుత్వం ఎన్నికల కోడ్ తొలగించడంతో ఈనెల 10న సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తులు అందించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలిందిగా కోరారు.

## గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను సందర్శించి, పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : గ్రూప్1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రూప్1 పరీక్షలు రాసేందుకు 3,697 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో పురుషులు 2,244 మంది, స్త్రీలు 1,453 మంది ఉన్నట్లు తెలియజేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులలో పురుషులు 1,806 మంది ఉండగా, స్త్రీలు 1,143 మంది ఉన్నారని మొత్తం 2,949 మంది పరీక్షలు రాయగా 79.77 శాతం నమోదైనట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్1 పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కొమురయ్య, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## ప్రమాణ స్వీకరణోత్సవ విజయోత్సవ ర్యాలీ

ప్రజాపక్షం/పాపన్నపేట : భారతదేశ ప్రధానమంత్రి గా నరేంద్ర మోదీ మూడోసారి భారతదేశ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో మండల కేంద్రమైన పాపన్నపేటలోని ప్రధాన రహదారిపై బిజెపి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని బిజెపి బూత్ స్థాయి నాయకులు పాపన్నపేటకు భారీ సంఖ్యలో చేరుకొని రెవెన్యూ ఆఫీస్ నుండి అయ్యప్ప ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మెదక్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్ లో అడుగు పెట్టబోతున్నారని. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బి కొండ రాములు, మాజీ సర్పంచులు ఇమ్మానియేల్, సంజీవులు, చంద్రయ్య, నాయకులు నరేష్, సుంకరి కిష్టయ్య, అశోక్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు బుక్స్ యూనిఫామ్స్ విక్రయించవద్దు

పాఠ్యపుస్తకాలు యూనిఫామ్
అధిక ధరలకు విక్రయిస్తున్న
ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
ప్రశాంత్ డిమాండ్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** రాష్ట్రంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో ఎటువంటి పుస్తకాలు యూనిఫామ్ ఇతర సామాగ్రిని విక్రయించుట చట్ట రిత్యా నేరమని వెంటనే ఆ పాఠశాలల యొక్క గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులుప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు యూనిఫామ్ ఇతర సామాగ్రిని అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తూ పేద మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్న కార్పొరేట్ యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుని వాటి గుర్తింపు రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేస్తుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు యూనిఫాం బుక్స్ అందించాలి అని తెలియజేశారు. దీనిపై డిఈఓ ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది విద్యార్థుల సమస్యలపై అందుబాటులో ఉండి కంప్లైంట్ ఇచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపడితే బాగుంటుందని విద్యార్థి సంఘాలు తెలిపాయి. ఈ యాజమాన్యాల దోపిడీలపై విద్యాశాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ది సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటిని జిల్లా సివిల్ కాంట్రాక్టర్లు అదివారం ఎన్నుకున్నారు. సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ జిల్లా జయ శంకర్ భూపాలపల్లి జల్లా అధ్యక్షునిగా కొత్త హరిబాబు తిరిగి మూడవ సారి ఎన్నికైయ్యారు.ఉపాధ్యక్షులుగా బడితెల వెంకటస్వామి,ప్రధాన కార్యదర్శి కెక్కర్ల శ్రీనివాస్,సహాయ కార్యదర్శి గంట దేవేందర్ రెడ్డి, కోశాధికారిగా జాడి తిరుపతి,కార్యవర్గ సభ్యులుగా బట్టు శ్రీనివాస్,కోనేరు సాంబశివ రా వు,గోగుల శ్రీనివాస్ రెడ్డి,నాగవెల్లి రాజ లింగమూర్తి,పెరుమాండ్ల చంద్రమౌళి,కుంభం శ్రీనివాస్ రెడ్డి లను ఎన్నుకున్నారు. సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ 2011 నుండి ఇప్పటి వరకు గత 13 సంవత్సరాల నుండి కొత్త హరిబాబు అద్యక్షునిగా పనిచేస్తున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కొత్త హరిబాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నకున్నందుకు మీనమ్మకాన్ని వమ్ము చేయకుండా అసోసియేషన్ సమస్యల పరిష్కారం కొసం నావంతుగా శక్తి వంచన లేకుండా పనిచేస్తానని హరిబాబు తెలిపారు. నాపైనమ్మకం ఉచ్చి మరొకసారి అధ్యక్షనిగా ఎన్నుకున్న ప్రతి ఒక్క కాంటాక్టర్ కు పేరుపేరు వరుసన ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

## హాజరు శాతం 77.86

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** గ్రూప్ 1 పరీక్షా కేంద్రాలను సందర్శించి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ తార డిగ్రీ కళాశాల కరుణ స్కూల్ లో ఏర్పాటు చేసిన గ్రూప్ 1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదివారం సంబందిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎక్కడ ఏలాంటి పోరపాట్లు జరుగకుండా గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లాలో 16 సెంటర్లలో 9672 మంది అభ్యర్తులకు గాను 7530 మంది అభ్యర్థులు హాజరైనట్లు వీరి హాజరు శాతం 77.86 గా నమోదైనట్లు ,2142 మంది గైరాహాజరైనారని తెలిపారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష




**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** పరీక్షా కేంద్రాల వద్ద పట్టిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతగా గ్రూప్ 1ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 16 సెంటర్లోలో 9672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల వ్ద బందోబస్తు ఏర్పాట్లను అదనపు ఎస్పీ ఎ. సంజీవరావు పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసు సిబ్బందిచే బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరిగిందని అదనపు ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్షా కేంద్రాలలో 9672 మంది అభ్యర్థులు పరీక్ష రాయల్సి ఉండాగా 7,530 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరి శాతం 77.86 గా నమోదు అయినట్లు 2142 మంది పరీక్షకు గైరాజరయ్యారని తెలిపారు.

## నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి





**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** వైద్య విద్యను అభ్యసించేందుకు దేశ వ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని..పరీక్ష నిర్వహణ తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగేం మధు, జెర్రిపోతుల జనార్ధన్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మే 5న పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారన్నారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావటం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన వారి మాటాను పెడచెవిన పెట్టి , నిర్లక్ష్యం చేయటం ద్వారా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యను దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సి విడుదల చేసిన ఫలితాలు,పేపర్ లీకేజీలపై సుప్రింకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## పేటలో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు వ్యక్తుల మృతి



**ప్రజాపక్షం/ సదాశివపేట :** సదాశివపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాధంలో లారీ ట్యాంకరు ,కారు నుజ్జు నుజ్జు అయింది. అంతే కాకుండా ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. సధాశివపేట N.H. 65 నంది కంది గ్రామ మెయిన్ రోడ్డుపైన హైదరాబాద్ నుంచి వస్తున్న అయిల్ ట్యాంకరు ఎం04పు 8801 హైదరాబాద్ వెళ్తున్న లారీ జిఎన్52 ప్ 8496 ,కారు KA 35N 6126 కారును ఢీ కొని సమయము మూడు గంటల 45 నిమిషాల సమయంలో ఈ యొక్క ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ క్రమంలో మూడు గంటలకు పైగా ప్రయాణికులు రాకపోకలకు చాల ఇబ్బందులకు గురై అయినారు.

## బండి సంజయ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** నూతన కేంద్ర మంత్రిగా ఎన్నికైన కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్‌ను తెలంగాణలో ఆదివారం న్యూఢీల్లీలోని తన నివాసంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు నెమలి కొండ వేణుమాదవ్ ఘనంగా సన్మానించారు. తెలంగాణలో బిజేపి గణనీయమైన అభివృద్ధి సాదించడంలో బండి సంజయ్ పాత్ర చెప్పుకోదగ్గదన్నారు. బండి సంజయ్ ని నూతనంగా కేంద్ర మంత్రిగా ప్రదాని మోడీ మంత్రి వర్గంలోకి తీసుకోవడం సామాన్య కార్యకర్తకు ఇచ్చిన గౌరవమని నెమలి కొండ వేణుమాదవ్ పేర్కోన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని అది బిజేపి ప్రత్యేకత అని పేర్కొన్నారు. బండి సంజయ్ ని సన్మానించిన సమయంలో రాష్ట్ర నాయకులు జి. మనోహర్‌రెడ్డి, గిరిధర్ చాఢ సురేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## దనియాకులను నామినేటెడ్ పదవి వరించేనా





**ప్రజాపక్షం/ గార్ల :** పల్లెలలో కాంగ్రేస్ పార్టీ బలోపేతానికై కృషి చేసిన వారికి అధిష్టానం అండగా నిలిచేనా , నామి నేటెటడ్ పదవులలో వీరికి అవకాశం యిచ్చేనా, కాంగ్రేస్ పార్టి కష్టకాలంలో ఉన్నప్పుడు గత పది ఏళ్లుగా ప్రతిక్షంలో ఉన్నా,పార్టీని అంటి పెట్టుకుని ఉండి కార్యకర్తలకు మనోధైర్యాన్నిస్తూ , పిసిసి ఇచ్చిన అదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, అధికార పార్టి ఆగడాలను నిలదీస్తూ ఎన్నో నిర్బంధాలను పోలీసు కేసులను ఎదురుకొని కాంగ్రేస్ పార్టీని పల్లె పల్లోలో పటిష్ట పరిచి విజయ తీరాలకు చేర్చిన నిబద్దత నిజాయతీ గల కాంగ్రేస్ పార్టి వీర విదేయుడు గార్ల మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు దనియాకుల రామారావు. ఇలాంటి నాయకులకు కాంగ్రేస్ అధిష్టానం గుర్తించి ఉన్నత స్థానాలు కల్పించాలని కార్యకర్తలు కోరుతున్నారు. 1996 లో కాంగ్రేస్ పార్టీలో చేరిన రామారావు పార్టిలో క్రమశిక్షణ గల కార్యకర్తగా పేరు తెచ్చుకుని 2001 లో కమ్యూనిష్టుల కంచుకోట గోపాలపురంలో ఎంపిటిసిగా పోటీచేసి స్వల్ప తేడాతో పరాజయం పోందారు.2013 లో వార్డు నెంబర్గా , 2019 లో కాంగ్రేస్ పార్టి ఏ బ్లాక్ అధ్యక్షునిగా ఉండి గార్ల మండలంలో మూడు ఎంపిటిసిలను,పర్పంచులను గెలిపించడమే కాకుండా గోపాలపురం ఎంపిటిసి స్థానంలో తన భార్యను గెలిపించి పార్టి సత్తా చాటారు. గత పదేళ్ళు రెండు పర్యాయాలు నియోజకవర్గంలో కాంగ్రేస్ నుండి గేలిచిన ఎంఎల్‌ఏ లు పార్టీని వీడి అధికార పార్టిలో చేరిగా వారితో పాటు మండలంలో పెద్ద లీడర్లుంతా పార్టీని వీడినా అదైర్య పడకుండా మండలంలో కాంగ్రేస్ పార్టి కార్యకర్తలను చైతన్య పరుస్తూ వారికి అండగా నిలిచి పార్టీని ప్రజల నుండి దూరం కాకుండా పోరాడిన రామారావు సేవలను గుర్తించిన కాంగ్రేస్ పార్టి అధిష్టానం జిల్లా అద్యక్షుడు భరత్‌చంద్రా రెడ్డి, 2020 లో రామారావును మండల అధ్యక్షుడిగా నియమించారు. నాటి నుండి నేటి వరకు పార్టినే ప్రాణంగా భావించి అనేక గెలుపులలో ప్రధాన పాత్ర పోశించిన దనియాకుల రామారావును సేవలను కాంగ్రేస్ పార్టి అధిష్టానం గుర్తించి రాష్ట స్థాయి నిమినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని మండల కాంగ్రేస్ కార్యకర్తలు ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడికి భరత్ చంద్రారెడ్డి, ఎంపి బలరాం నాయక్ ,ఎంఎల్‌ఏ కోరం కనకయ్య,ల ఆశీస్సులు అండదండలు తనకు తప్పకుండా ఉంటాయని వారి సహకారంతో రాష్ట స్థాయి నామినేటెడ్ పదవులలో అవకాశం దక్కుతుందని దనియాకుల రామారావు ఆశాభావం వ్యక్తం చేశారు.